# నేను లేక నువ్వు లేవు

మే ఒకటవ తారీఖు. నేను పొద్దున్నే ఏడున్నరకే ఆఫీసులో సీరియస్‌గా పనిచేసుకుంటుంటే వచ్చాడు బాబ్, చేతిలో వున్న బ్రేక్ ఫాస్ట్ టాకో తింటూ.

'మరీ పొద్దున్నే వచ్చేశావే' అన్నాను తల పైకెత్తి.

'ఇవాళ ఏరోజో తెలుసా? ఇమ్మిగ్రంట్లు లేకుండా ఒక రోజు. అలా పేరు పెట్టటమే కాకుండా దేశమంతటా శాంతియుతమైన ఆందోళన కూడా చేస్తున్నారు. రోజూ ఆఫీసుకి వచ్చేటప్పుడు దారిలో మెక్సికన్ టాకో జాయింటులో బ్రేక్ ఫాస్ట్ టాకోలు కొనుక్కొని రావటం అలవాటయిపోయింది. ఇవాళ వాళ్ళా షాపు తెరుస్తారో లేదోనని, ఇంట్లోనే రెండు టాకోలు తయారుచేసుకుని తెచ్చుకున్నాను' అన్నాడు.

అప్పుడే గుర్తు వచ్చింది, కొత్తగా అమలుచేద్దామనుకుంటున్న ఇమ్మిగ్రేషన్ బిల్ మీద దేశమంతటా ఆరోజు ఆందోళనలు చేస్తున్నారని. స్కూలు పిల్లలూ, కాలేజీ యువతా, రకరకాల ఉద్యోగాల్లో పనిచేసేవారూ.. ఇలా ఎంతోమంది ఎన్నో రకాలుగా ఊరేగింపులు చేస్తున్నారు. మరి వీళ్ళంతా ఎవరు? చాలమంది ఇల్లీగల్ ఇమ్మిగ్రంట్స్ అనబడే అమెరికాకి వలస వచ్చి, న్యాయ విరుద్ధంగా నివాసం వుంటున్నవారు. మిగతా కొద్దిమంది, వారికి అండగా వచ్చిన సానుభూతిపరులు. మరి ఈ ఆందోళనకారులు ఏదేశాలవారు? దాదాపు ఎనభై - తొంభై శాతం మెక్సికన్లూ, తదితర మధ్య, దక్షిణ అమెరికావారూ. మిగతా వాళ్ళల్లో మిగతా అందరూ.

అమెరికన్ కాంగ్రెస్‌లో ఒక వర్గం వారు ఇలాటి ఇల్లీగల్ ఇమ్మిగ్రంట్స్‌లని వాళ్ళ దేశాలకి తిప్పి పంపించేయాలనీ, తప్పించుకుని తిరుగుతుంటే జైలు పాలు చేయాలనీ అంటున్నారు. రెండవ వర్గం వారు, వీళ్ళు న్యాయ విరుద్ధంగా వుంటున్నా, దొంగతనంగానో దొరతనంగానో ఉద్యోగాలు చేస్తున్నారు, టాక్సులు కడుతున్నారు, అక్రమాలూ అన్యాయాలూ చేయకుండా మంచి పౌరులుగా బ్రతుకుతున్నారు కనుక, వాళ్ళని క్షమించి పౌరసత్వం ఇచ్చేయమని అడుగుతున్నారు. వాషింగ్టన్‌లో ఆ కథ అలా జరుగుతుండగా, వీధుల్లో రకరకాలుగా శాంతియుత ఆందోళలను జరుగుతున్నాయి. దాని ఫలితమే 'ఈ ఇమ్మిగ్రంట్లు లేకుండా ఒక రోజు'

ఆ రోజున న్యూయార్కులో మూడు లక్షల మందీ, లాస్ ఏంజలెస్‌లో 5 లక్షల మందీ.. ఇలా ఎన్నో నగరాల్లో ఎంతోమంది ఈ ఆందోళనలలో పాల్గొన్నారు. ఇలాటివారిలో దాదాపు అందరూ చిన్న ఉద్యోగాల్లో పనిచేసేవాళ్ళే. ఎందుకంటే పెద్ద ఉద్యోగాల్లో, కంపెనీలు ఇల్లీగల్ ఇమ్మిగ్రంట్స్‌కి ఉద్యోగాలిచ్చి పట్టుబడితే, లక్షల్లో ఫైన్లు కట్టటమేకాక జైలుకి కూడా వెళ్ళవలసి రావచ్చు. అంతేకాదు చిన్న ఉద్యోగాల్లో, అంటే గృహ నిర్మాణం, రోడ్ల పని మొదలైన వాటిలో పనిచేసేవారికి, ఆ రోజు ఉద్యోగాలకి రాకపోతే తొలగిస్తామని చెప్పినట్టు పేపర్లో వచ్చింది. గమ్మత్తేమిటంటే తాము న్యాయ విరుద్ధంగా చేస్తున్న పనిని న్యాయబద్ధంగా చేయటం కోసం చేస్తున్నది ఈ ఆందోళన. అలాటి ఆందోళనలో పాల్గొంటే, ఉద్యోగంలోనించి తీసేస్తాం

అంటూ బహిరంగంగా చెబుతున్నారు కొందరు న్యాయబద్ధ ప్రబుద్ధులు!

అమెరికాలో వుంటున్న ఇల్లీగల్ ఇమ్మిగ్రంట్స్ సంఖ్య పదకొండు మిలియన్లు. అంటే నూటపది లక్షలు. ఇది ప్రభుత్వానికి ఒకపెద్ద సమస్యగా తయారయింది. మెక్సికో ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుండటం వల్లా, జనాభా విపరీతంగా వుండటం వల్లా, అవకాశాలు అక్కడేమీ లేకపోవటం వల్లా, పక్కనే అమెరికా పచ్చగా వుండటం వల్లా, మెక్సికోనించీ దొంగతనంగా సరిహద్దులు దాటి ప్రతిరోజూ ఎంతో మంది కళ్ళుగప్పి వస్తున్నారు. పదిహేను సంవత్సరాల్లో 90 లక్షలమంది ఇలా సరిహద్దులు దాటి వచ్చారంటే, ఇది ఎంత పెద్ద సమస్యో తెలుస్తుంది.

మరి బార్డర్ సెక్యూరిటీవాళ్ళు ఏం చేస్తున్నారయ్యా? నిద్రపోతున్నారా అని మీకు అప్పుడే అనుమానం వచ్చేసిందని నాకు తెలుసు. లేదు నిద్రపోవటం లేదు. అంతేకాదు, ఏ దేశంలోనూ లేని హైటెక్ పరికరాలతోనూ, చీకట్లో కూడా మనుష్యులని కనిపెట్టగలిగే ఇన్ఫ్రారెడ్ కెమెరాలతోనూ వెతుకుతూనే వున్నారు. అలాటి వారిని ప్రతిరోజూ పట్టుకుంటుంటూనే వున్నారు. వాళ్ళ దేశంలో దించి వస్తున్నారు. ఇలా వచ్చినవారు తొంభై లక్షల మంది అయితే, వెనక్కి పంపబడ్డవారు దానికి ఐదారు రెట్లు వుంటారు. అమెరికాకి మెక్సికోకి వున్న సరిహద్దు కూడా తక్కువేమీ కాదు. నాలుగు రాష్ట్రాలతో కొన్ని వేల మైళ్ళ పొడుగునవుంది. టెక్సాస్, న్యూమెక్సికో, ఆరిజోనా, కాలిఫోర్నియా రాష్ట్రాలతో సరిహద్దులున్నాయి. ఒక్క టెక్సాస్‌తో మెక్సికోకి సరిహద్దు వెయ్యి మైళ్ళ పైన వుంది. మనుష్యులు తక్కువగా వున్న అమెరికాలో, దొంగతనంగా మనుష్యులు రాకుండా చూడటానికి ఇంకా ఎంతోమంది మనుష్యులు కావాలంటే ఎలా! అదీకాక సరిహద్దులని విడదీస్తూ వున్నవి, చాల వరకూ నదులూ, ఎడారులూ. నదులు ఈదుకుంటూ కుటుంబాలతో సహా రావటం కద్దు. అందుకనే ఈదుకుంటూ వస్తుంటే వీపులు తడుస్తాయి కనుక, మెక్సికన్స్‌కి వెట్ బాక్స్ అని మారుపేరు వుంది.

ఒక స్కూలు పిల్ల చెబుతున్నది రేడియోలో, 'మా అమ్మ నన్ను వీపుకి కట్టుకుని నదిలో ఈదుకుంటూ వచ్చిందిట ఈ దేశానికి. అప్పుడు నాకు రెండేళ్ళ వయసు. మా అక్క ముందే పరుగెత్తింది. రెండు రోజుల తర్వాత కలుసుకున్నాముట మేమందరం మళ్ళీ!' అని. ఇలాటి కథలు వినటనికి బాధగా వుంటాయి.

మరి అధికారులు, 911 తర్వాత బార్డర్ సెక్యూరిటీని పెంచటం అవసరమైందనీ, అంతేకాక దేశరక్షణ కోసం వలస విధానంలో చాల మార్పులు చేయాల్సి వస్తోందనీ అంటున్నారు. వాళ్ళు చెప్పేదీ సమర్థనీయమే! అమెరికాలో ఎన్నో చిన్న చిన్న ఉద్యోగాలు, అంటే ఇళ్ళల్లో పని మనుష్యులుగానూ, తోటపని చేయటానికీ, ఇళ్ళు కట్టటానికీ, పొలాల్లో పనిచేయటానికీ, వీళ్ళ అవసరం చాల వుంది.

మెక్సికన్లు స్వతహాగా కష్టపడి పనిచేస్తారు. చెప్పిన మాట వింటారు. మంచివాళ్ళు. అలాటి వాళ్ళు అమెరికాతో అనేదేమిటంటే, 'నేను లేక నువ్వు లేవు!' అని.

0 0 0